# ముందు చూపు

-యం.వెంకటేశ్వరరావు

ఆ ఇంటి ముందు వేసిన షామియానా కింద మరణించిన బలరామయ్య శవం పడుకోబెట్టుంది. సమీపంలో కూచున్న ఆడవాళ్ళు, పిల్లల ఏడుపులు.

కొంచెం అవతల వేసున్న కుర్చీల్లో బంధువులు, సన్నిహితులు కూర్చున్నారు. మొత్తమ్మీద అక్కడి వాతావరణం శోకమయంగా వుంది.

అంతలో అక్కడికి ఓ వ్యాన్ వచ్చి ఆగింది. ఒక డాక్టరు, ఇద్దరు నర్సులు, ఇద్దరు అటెండర్లు కిందకి దిగారు.

కుర్చీలో కూచున్న ఒకతను లేచొచ్చి 'ఏం కావాలన్నట్లు' చూసాడు.

"బలరామయ్యగారికి గుండెపోటు వచ్చి మరణించినట్లు తెల్సి వచ్చాం" అన్నాడు డాక్టర్.

"ఎందుకు?"

"ఇంతకీ మీరు...?" డాక్టర్ అడిగాడు.

"బలరామయ్యగారి రెండో కొడుకుని."

రెండు నిముషాల అనంతరం...

"మేము ఐ ఫౌండేషన్ నుండి వస్తున్నాము. ఇవి బలరామయ్యగారు తన మరణానంతరం కళ్ళు దానం చేయడానికి రిజిస్టర్ చేయించిన పేపర్లు" అని డాక్టర్ ఆ పేపర్లు చూపబోతుంటే-

"సారీ డాక్టర్. మా నాన్నగారు ఐ డొనేషన్‌కి రిజిస్టర్ చేయించి ఉండొచ్చు. కానీ ఇప్పుడు ఇంత మంది ముందు... వద్దు. మాకెవ్వరికీ ఇష్టంలేదు" అన్నాడు.

"చదువుకున్న మీరే ఇలా అనొచ్చా? కళ్ళు దానం చేయడమంటే..." డాక్టర్ ఇంకా ఏదో చెప్పబోతుంటే-

డాక్టర్ బృందం అక్కడికి ఎందుకొచ్చారన్న వార్త క్షణాల్లో ఆ ప్రదేశమంతా పాకిపోయింది. మెల్లగా అక్కడ చేరిన బంధువులంతా డాక్టర్ చుట్టూ చేరి తలా ఒక అభిప్రాయం వెల్లడిస్తూ వాతావరణాన్ని వేడెక్కించడంతో డాక్టర్ చెబుతున్న ఐ డొనేషన్ ప్రాముఖ్యత అరణ్యరోదనే అయింది.

"చూడండి డాక్టర్! చావింటికొచ్చి మీరు ఉపన్యాసాలు ఇవ్వవద్దు. మా నాన్నగారి కళ్ళను దానం చేయడానికి మేమెవ్వరం ఒప్పుకోం. దయచేసి మీరెళ్లవచ్చు" అన్నాడు బలరామయ్య రెండో కొడుకు.

"కళ్ళు దానం చేయడం బలరామయ్యగారు ఇష్టపడ్డ విషయం. ఆయన ఆత్మకి శాంతి కలగాలంటే" నర్సు ఏదో చెప్పబోతుంటే-

"మా నాన్నగారి ఆత్మని ఎలా శాంతింపజేసుకోవాలో మాకు బాగా తెల్సు. ముందు మీరు బయలుదేరండి" అని బలరామయ్య కొడుకు కాస్త గట్టిగా చెప్పడంతో అక్కడ చేరిన బంధుజనమంతా కోరస్‌గా అరవడంతో డాక్టర్ బృందం గబగబా వ్యాన్‌లో ఎక్కి కూర్చున్నారు.

ఇంతలో డాక్టర్ కోటు జేబులోవున్న సెల్‌ఫోన్ మ్రోగింది.

"డాక్టర్ జగన్మోహన్!"

"యస్!"

"డాక్టర్ రామ్‌రెడ్డి స్పీకింగ్."

"చెప్పండి."

"నిన్న ఉదయం బలరామయ్య అని ఓ హార్ట్ పేషెంట్ నా క్లినిక్‌లో అడ్మిట్టయ్యారు. రెండోసారి గుండెపోటు వచ్చింది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈరోజు ఉదయం ఆయన మరణించారు.

నిన్న రాత్రి బలరామయ్యగారిని చెకప్ చేస్తుంటే ఆయన నాతో 'డాక్టర్! ఒకవేళ నేను మరణిస్తే నా కళ్ళు తీసి భద్రపరచి ఐ ఫౌండేషన్‌కి పంపండి. నేనక్కడ రిజిస్టర్ చేయించాను. నా డెడ్ బాడీ ఇంటికెళ్లిందంటే వాళ్ళు నా కోరిక నెరవేరనివ్వరు. నేను మరణించిన వెంటనే నా కళ్ళు తీసి ఎవ్వరికీ సందేహం రాకుండా డమ్మీ కళ్ళు అమర్చండి' అని చెప్పారు. ఇవ్వాళ ఆయన మరణించిన వెంటనే ఆయన కోరిక ప్రకారం కళ్ళు తీసి భద్రపరిచాను. హాస్పిటల్‌కు ఫోన్ చేస్తే మీ ఫోన్ నెంబరిచ్చారు. మీరు నా క్లినిక్‌కి వచ్చి బలరామయ్యగారి కళ్ళు తీసుకెళ్ళొచ్చు. వచ్చే ముందు ఫోన్ చేసి రండి" అన్నారాయన.

సెల్‌ఫోన్ ఆఫ్ చేసిన డాక్టర్ జగన్మోహన్‌కి 'ఆలస్యం చేయకుండా నా కళ్ళు తీసుకెళ్లండి' అని బలరామయ్య అంటున్నట్లు అనిపించింది.

